# అంతరంగయాత్ర
## ANTHARANGA YATRA

KRISHNAMURTI FOUNDATION INDIA APRIL 2015 - JULY 2015 Rs. 2/- VOL. IX ISSUE 3

జె. కృష్ణమూర్తి బోధనలతో కూర్చిన ప్రచురణ



## కోపము - అసహనము

'ఇ' వచ్చి అడిగిన ప్రశ్న ఏమిటంటే తన కోపాన్ని ఎలా అధిగమించాలి-అని. అతడికి తన సహోద్యోగి అంటే ఒళ్ళు మండిపోతున్నదిట. ఆ సహోద్యోగి ప్రవర్తనా, తీరుతెన్నులూ 'ఇ' ని మహా విసిగిస్తున్నాయట.

మరికొంత సేపు మాట్లాడాక, 'ఇ' లో అంత కోపం ఎందుకు వస్తున్నదో అతడికి సూటిగా చూపించాను. 'ఇ' ప్రవర్తనలో ఎటువంటి పద్ధతీ, తీరూ వున్నాయో ఆ సహోద్యోగి కూడా అదే విధమైన పద్ధతిలో, తీరులో ప్రవర్తించాలని 'ఇ' కోరుకుంటున్నాడు. ఇదే అతడిలో అసహనాన్ని పెంచుతున్నది. అసహనము అంటే ఆలోచనా లేమి. 'ఇ' కనుక మరో చోట ఉద్యోగం వెతుక్కుని, ఈ సహోద్యోగిని వదిలేసి వెళ్ళినా, మళ్ళీ అక్కడా ఇదే సమస్య ఎదురవుతుంది. ఎందుకంటే సమస్య తనే తప్ప ఆ సహోద్యోగి కాదు. 'ఇ' చేయవలసినది పరిస్థితులను అర్థంచేసుకోవడం. అంతేకాని ఆ పరిస్థితులను మార్చడం కాదు. తన కోపం నుండి తాను విడుదల చెందడం కోసం పరిసరాలపై ఆధారపడితే అప్పుడు అతడు పరిసరాలకు బానిస అవుతాడు. పరిసరాల పైన ఆధారపడితే అప్పుడు అతడు ఆలోచనా హీనుడవుతాడు. కొందరుంటారు. వాళ్ళు ఎప్పుడూ తమ సంబంధ బాంధవ్యంలో మార్పు రావాలని కోరుకుంటూ వుంటారు. అది ఒకరితో బాంధవ్యం అవచ్చు, ఒక పదిమంది గల బృందంతో గల సంబంధ బాంధవ్యంతో అవచ్చు. ఆ సంబంధ బాంధవ్యం వారిలో నిరాశా నిస్పృహలు మిగిల్చింది. ఆ సంబంధం వారిని విసిగించింది. అందుచేత వారు మరొకరితో స్నేహం కోరుకుంటారు. మరొకరిలో ప్రేమను వెతుక్కుంటారు. అయితే పరస్పర సంబంధ బాంధవ్యం అనే దానిని వారు సంపూర్తిగా ఆకళింపు చేసుకోలేదు కాబట్టి కేవలం పరిసరాలను మార్చడం వల్ల మళ్ళీ అవే ఘర్షణలు, మళ్ళీ అవే నిరాశా నిస్పృహలు, మళ్ళీ అవే భ్రమలో నుండి బయటపడిన సంతుష్టభావాలూ భిన్న భిన్న రూపాలలో పుట్టుకొస్తాయి.

అందుచేత 'ఇ' చేయవలసినది ఏమిటంటే తనలో ఆలోచనాలేమి వున్నదనే ఎరుక తెచ్చుకోవాలి. దానికి వెనుక గల కారణాన్ని తెలుసుకోవాలి.

('ది వర్ల్డ్ విదిన్' నుండి)




## సరికొత్త సంపుటం

రకరకాల సమస్యలతో తమ వద్దకు వచ్చిన వారికి ఇచ్చిన వ్యక్తిగతమైన ఇంటర్వ్యూలలో వారితో చర్చించిన విషయాలను కృష్ణమూర్తే స్వయంగా లిఖించి పెట్టుకున్నారు. వాటిలో కొన్నింటిని ఏర్చి కూర్చిన సంపుటం ఇది. 234 పుటలు గల ఈ పుస్తకంలో 90 అంశాలను గురించి కృష్ణమూర్తి విపులీకరించి చెప్పడం చూడవచ్చును. కోపము - అసహనము వద్ద నుండి జీవన్మరణాల సమస్య, 'నేను', 'నాది', మనిషి - యంత్రము, శాంతి ఒక అంతరాయమా? నిజమైన శాంతి ఏమిటి? మతాలన్నింటికీ అతీతంగా, తనను తాను స్పష్టపరచుకోవడము, సంఘర్షణను అర్థం చేసుకోవడము మొదలైన అనేక అస్తిత్వ సమస్యలను కృష్ణమూర్తి విడమరచి చూపుతారు. ఈ సంక్షుభిత ప్రపంచంలో నివసిస్తున్న స్త్రీ పురుషుల ఆంతరిక అలజడులను, ఆందోళనలను, ఆవేదనలను అర్థంచేసుకున్న ఒక మిత్రునిలా వారి సందిగ్ధాలను వారికే తేటతెల్ల పరచడం ఈ పుస్తకంలో కనబడుతుంది.

వెల : రూ 295; కృష్ణమూర్తి ఫౌండేషన్, ఇండియా, చెన్నయిలో ప్రతులు లభ్యమవుతాయి.

## సకారాత్మక చర్య అంటే ఏమిటి?

మానవులలో వుండే విపరీతమైన ఆరాటాన్ని పరిపూర్ణంగా పరివర్తించే మార్గం ధ్యానం. ఏవేవో నీతి సూత్రాలలో, సిద్ధాంతాలలో మనిషి చిక్కుకొని పోయాడు. అందువల్లనే తనకీ ఇతరులకీ మధ్య నున్న సంఘర్షణలను అంతమొందించలేక పోతున్నాడు. జాతీయతా పరమైన సిద్ధాంతాలూ, మతపరమైన సిద్ధాంతాలూ, తన డాంబికపు మొండి తనమూ, మనిషిని ధ్వంసం చేస్తున్నాయి. ఈ విధ్వంసకాండ

ప్రపంచమంతటా సాగుతూనే ఉంది. మనిషి తన సహనంతో, రాజీ పడటంతో, చర్యలతో, స్వాభిమానం కాపాడుకునే సాధనాలతో ఈ ఘర్షణని అంతమొందించే ప్రయత్నం చేస్తూనే ఉంటాడు. అయినా తన నిబద్ధతలో కూరుకు పోయే ఉన్నాడు.

మంచితనం మౌఢ్యంలో ఉండదు. కొన్ని కొన్ని సూక్తులు, కొన్ని పద్ధతులు అవలంబించడం ద్వారా కలిగే దర్పంలో మంచితనం ఉండదు. ఇవన్నీ ప్రేమను నెట్టివేస్తాయి. లేకుండా చేస్తాయి. ధ్యానమంటే ఆ ప్రేమ వికసనం చెందడం.

ఆ ఉదయం లోయ చాలా నిశ్చలంగా ఉంది. తన చెలిని పిలుస్తూండే గుడ్లగూబ కూతని ఆపేసింది. ఆ గుడ్లగూబ గంభీరమైన కంఠధ్వని ఒక గంట క్రితమే ఆగిపోయింది. ఇంకా సూర్యోదయం కాలేదు. తారలింకా ప్రకాశవంతంగా మెరుస్తూనే ఉన్నాయి. పశ్చిమాద్రిపై ఒక తార అస్తమిస్తోంది. ప్రాగ్దిశలో వెలుతురు మెల్లగా ఎగబ్రాకుతోంది. సూర్యుడు దయిస్తున్న కొద్దీ మంచుతో కప్పబడిన రాతిబండలు మిలమిలలాడుతున్నాయి. బ్రహ్మజెముడు ఆకులూ బాగా మెరుగు పెట్టబడిన వెండి వలె ఉన్నాయి. ధరిత్రి సౌందర్యం మేల్కొంటోంది.

వరండాలో రెండు కోతులున్నాయి. ఎఱ్ఱని ముఖమూ, గోధుమరంగు దేహమూ, మరీ పొడవు కాని తోకలూ కలవి. ఒక కోతి రెండవ దాని మీది పురుగులను చాలా నైపుణ్యంతో ఏరుతూ, దొరికిన పురుగుల్ని నోట్లో వేసుకుంటోంది. అవి నిలకడ లేకుండా ఉన్నాయి. వరండా మీద నుంచి ఒక పెద్ద శిరీష వృక్షం మీదికి దూకి, తీరిగ్గా దిగి నడుస్తూ ఒక సందులోకి వెళ్ళిపోయాయి.

గ్రామం మేల్కొన్నా నిశీధి, నిశ్చలత నిలిచే ఉంది. చిత్రమైన నిశ్చలత అది. కేవలం శబ్దం లేకపోవడం కాదది. మానవుని మనస్సు కల్పించలేదా నిశ్చలతని. తన నిర్విరామమైన వాగుడు ద్వారా ఊహించినదీ కాదు ఆ నిశ్చలత. ఎవ్వరూ అర్థించకుండా అకారణంగా ఏర్పడిన నిశ్చలత అది. కావు కావుమనే కాకులూ, కొండలూ, వృక్షాలూ, మానవులూ, వానరులూ అన్నీ ఆ నిశ్చలతలో ఉన్నాయి. అది సాయంకాలం వరకూ కొనసాగుతూనే ఉంటుంది. ఎటొచ్చీ మనిషికే దాని ఎరుక లేదు. చీకటి పడింతరువాత మళ్ళీ ఉంటుంది. అది రాతిబండలకి తెలుస్తుంది. కొత్తగా నాటబడిన వృక్షానికీ బండరాళ్ళ నడుమ పాకే బల్లికీ కూడా తెలుస్తుంది.

గదిలో నలుగురైదుగురున్నారు. వారిలో కొందరు విద్యార్థులు. మరికొందరు ఉద్యోగస్థులైన పట్టభద్రులూ ఉన్నారు. ఒక విద్యార్థి ఇట్లా అన్నాడు.

‘‘క్రిందటి సంవత్సరం మీ ప్రసంగాన్ని విన్నాను. ఈ ఏడు కూడా విన్నాను. మేమంతా నిబద్ధుల మని గ్రహించాను. సమాజంలోని క్రౌర్యం గురించీ, నాలోనే ఉన్న ఈర్ష్యా కోపాల గురించీ కూడా ఎరుక ఉంది. మత చరిత్రా అందులోని యుద్ధాలూ నీతిబాహ్యమైన కార్యకలాపాలూ తెలుసు నాకు. నేను చరిత్రని అధ్యయనం చేశాను. పాతుకు పోయిన నమ్మకాలూ, సిద్ధాంతాలూ, వాటి కోసం జరిగిన అర్థరహితమైన యుద్ధాల గురించి అధ్యయనం చేశాను. ఇవే ప్రపంచంలో సంఘర్షణలకు కారణ భూతమైనవి. నాలో సహా సర్వ మానవాళిలోనూ గల ఉన్మత్తత మమ్మల్ని బందీలను చేసింది. మాకు వినాశనం తప్పదనిపిస్తోంది. మాలో మార్పు తెచ్చుకోనంతవరకు ఏమీ లాభం లేదనిపిస్తున్నది. తమలో మార్పును తెచ్చుకున్న అత్యల్ప సంఖ్యాకులే ముఖ్యం. వాళ్ళే హింసాపూరితమైన ఈ లోకానికి ఏదైనా చేయగలుగుతారు. కొంతమందిమి, మరి కొందరు రానివారికి ప్రతినిధులంగా ఈ విషయాన్ని మీతో చర్చిద్దామని వచ్చాం. మాలో నిజాయితీ ఉంది. కానీ అది ఎంతవరకు మమ్మల్ని తీసుకొని వెళ్ళగలదో తెలియదు. మమ్మల్నే తీసుకోండి. మాకున్న అసంపూర్ణ నిజాయితీతో, వెర్రి ఆవేశంతో, అసమంజసతతో, మా అంచనాలతో, మా అహంభావాలతో మభ్యపడి పోయే మేము, నిజంగానే మారగలమా? ఇది జరగకపోతే ఒకళ్ళ నొకళ్ళం నాశనం చేసుకుంటాం. మానవ జాతే మాయమై పోతుంది. ఇంతటి తీవ్రమైన స్థితిలో రాజీకి వస్తే కొంత సామరస్యం కుదరవచ్చు.అయినా ఏ ఉన్మత్త సంఘమో అణుబాంబుని ప్రయోగించవచ్చు. అందరమూ ఏకంగా మునిగిపోనూ వచ్చు. ఇదంతా సుస్పష్టంగానే ఉంది. దీని విషయం రచయితలూ, అధ్యాపకులూ, సాంఘిక శాస్త్రవేత్తలూ, రాజకీయవాదులూ అంతులేకుండా వర్ణిస్తూనే ఉన్నారు. ఈ పరిస్థితిలో ఒక సమూలమైన మార్పు సాధ్యమేనా?'' అన్నాడా విద్యార్థి.

మనలో కొందరికి ఈ హింసాత్మకతే సంతోషదాయకం కాబట్టి వాళ్ళకి పరివర్తనంటే ఇష్టం లేకపోవచ్చు. కొందరికి ఇది లాభసాటిగానే ఉంది. వాళ్ళు పాతుకుపోయిన స్థానాలలోనే ఉండిపోవాలన్న కోరిక ఇంకా కొందరికుంది. మరికొందరు పరివర్తన ద్వారా ఏదో గొప్ప ఉద్వేగమూ మితిమీరిన భావావేశ ప్రకటనా కలుగుతాయని భావిస్తున్నారు. మనలో చాలా మందికి ఏదో ఒక రూపంలో అధికారం కావాలి. తన మీద తనకి ఆధిపత్యం, ఇంకొకరి మీద అధికారం, నాయకత్వపు అధికారం, ఖ్యాతి వల్ల అధికారం – ఇత్యాది. మతపరమైన అధికారం వలెనే రాజకీయ అధికారం కూడా దుష్టమైనది. ప్రాపంచిక అధికారం గానీ, సైద్ధాంతిక అధికారం గానీ మానవుని మార్చవు. తనని తాను మార్చుకోవాలన్న ఇచ్ఛాశక్తి గాని, సంకల్పం గాని పరివర్తనని తీసుకురావు.

“ఈ విషయాన్ని అర్థం చేసుకోగలను. సంకల్పం గాని, నీతి సూత్రాలు గాని, సిద్ధాంతాలు గాని మార్గం కావంటే ఇక పరివర్తనకి దారేమిటి? ఆ ప్రేరకశక్తి ఏమిటి? పైగా, దేనిగా పరివర్తన చెందాలి?'' అన్నాడా విద్యార్థి.

గదిలో ఉన్న పెద్దవాళ్ళు ఈ సంభాషణను ఆసక్తితో వింటున్నారు. అందరు ఎంతో సావధానంగా ఉన్నారు. ఒక్కరు కూడా కిటికీలోంచి బయటకు చూడలేదు. అక్కడ ఆ ఉదయం వేళ చెట్టుకొమ్మ మీద కూర్చుని తనని తాను ముక్కుతో శుభ్రం చేసుకుంటూ, ఈకలను సవరించుకుంటూ ఆ ఎత్తయిన చెట్టుపై నుంచి చూస్తున్న దొక ఆకుపచ్చని పిట్ట. దానిని ఎవ్వరూ గమనించలేదు.

ఒక పెద్దాయన “ఏదో ఒక మార్పు రావాలని నేను ఏ మాత్రం కోరుకోవడం లేదు. అది ఇంతకన్నా అధ్వాన్నం కావచ్చు.

పూర్తి అనిశ్చితికీ, అభద్రతకీ, భీభత్సానికీ దారి తీసే పద్ధతి కంటె క్రమబద్ధమైన ప్రస్తుతపు అస్తవ్యస్తతే నయం. కాబట్టి, ఎట్లా మార్చాలి, మార్పు అవసరం అంటూ నీవనే మాటలతో నేను ఏకీభవించలేను, మిత్రమా! ఒక ఊహగా బాగానే ఉంది నాకు కూడా. కానీ నా ఉద్యోగాన్ని, నా ఇంటినీ, నా కుటుంబాన్నీ దోచుకునే విప్లవం నాకు అప్రియమైన భావం. నాకు అక్కర్లేదది. నీవు చిన్నవాడివి. ఇటువంటి ఆలోచనలతో ఆడుకోగలవు. అయినా ఈ చర్చను వింటాను. దీని పర్యవసానం ఏమిటో చూస్తాను" అన్నారు.

ఆధికృతా భావంతో, ఒక కుటుంబానికి గాని, ఒక సంఘానికి గాని, ఒక రాజకీయ కక్షకి గాని, మతపరమైన కక్షకి గాని కట్టుబడక పోవడం వల్ల కలిగే స్వేచ్ఛాభావంతో విద్యార్థులంతా ఆ పెద్దాయన వైపు చూచారు. తాము పెట్టుబడి దారులు గాని, కమ్యునిస్టులు గాని కాము అనీ, ఏ రాజకీయ కార్యకలాపాలతోను సంబంధం లేనివాళ్ళమనీ చెప్పారు. ఒక మాదిరి సహనంతో, ఒక రకమైన ఇబ్బందితో చిరునవ్వుతో ఆ సంగతి చెప్పారు. పెద్దతరం వాళ్ళకీ, చిన్నతరం వాళ్ళకీ నడుమ ఉండే అంతరమే ఇక్కడా ఉంది. దానికి వారధి వేసే ఉద్దేశ్యం వాళ్ళకి లేదు.

"మేము దేనికీ కట్టుబడి లేము. అందువల్ల కపటులం కాము. మేము ఏం చేయాలనుకుంటున్నామో మాకే తెలియదు. నిజమే. అయితే ఏది తప్పో అనేది మాకు తెలును. సామాజిక విభేదాలు, జాతిపరమైన విభేదాలు మాకక్కర్లేదు. మతపరమైన అర్థంపర్థంలేని నమ్మకాలు, విశ్వాసాల పట్ల ఆసక్తి లేదు మాకు. రాజకీయ నాయకులు కూడా అక్కర్లేదు మాకు. అయితే అసలు యుద్ధాలనే లేకుండా చేసే వేరే రకమైన రాజకీయాలు ఉండాలి కదూ! అందువల్ల మానవునిలో పూర్తి పరివర్తన కలిగించే ప్రక్రియలో మేము కూడా పాలుపంచుకోవాలనుకుంటు–న్నాము. మాకు ఆ అక్కర ఉంది. సరే, మళ్ళీ ప్రశ్న దగ్గిరకే వద్దాం. ప్రథమంగా, మనల్ని పరివర్తించేది ఏది? రెండోది, దేనిగా పరివర్తన చెందాలి?" అన్నాడు విద్యార్థి.

రెండవ ప్రశ్న మొదటి దానిలోనే ఇమిడి వుంది కదా. దేనిగా మారాలో మీకు తెలిస్తే ఇంక అది మార్పెట్లా అవుతుంది? రేపు ఏమవుతామో తెలిస్తే " ఏమి జరుగనున్నదో " వర్తమానంలోనే ఉన్నట్టర్థం. భావికాలమే వర్తమానం. ఎరిగిన భవిష్యత్తే ఎరిగిన వర్తమానం. ఇప్పుడు తెలిసిన దానికి కొద్ది మార్పు చేసి పైకి ప్రక్షేపించినదే భవిష్యత్తు. "అది స్పష్టంగా తెలుస్తోంది. అంటే, సమస్యంతా పరివర్తనమే. ఎట్లా మారుతామనే మాటలతో నిర్వచనం కాదు. అందువల్ల మొదటి ప్రశ్నకే పరిమిత మవుదాం. ఎట్లా పరవర్తన చెందుతాం? ఏ ప్రేరణకి ఈ అడ్డంకులని ఛేదించే శక్తీ, ఉద్దేశ్యమూ ఉన్నాయి? "

ఏ కార్యాచరణా లేకపోవడమే. "ఉన్నదాన్ని" పూర్తిగా కాదనడమే. నిరాకరణలో ఉన్న మహత్తర శక్తిని మనం గమనించాం. సూత్రాలతో విధానాలతో నిర్మితమైన దానినీ, దాని వలన సంక్రమించే అధికారాన్ని – ఆ ఆధిపత్యాన్నీ నిరాకరిస్తే, ఆ నిరాకరణే ఆలోచన చేత నిర్మించబడిన వాటినన్నిటినీ నిరాకరించే శక్తినిస్తుంది. నిరాకరణే ఆ శక్తి.

''కాలక్రమేణా మనలో పేరుకుపోయినదే వర్తమానం. దానికి చనిపోవాలి అని మీరంటుంటారు. ఇదేనా ఆ మాటకి అర్థం?"

అవును. ఈ చనిపోవడమే తిరిగి కొత్తగా జన్మించడము అంటే. పరివర్తన అనే ఆ చలనం – ఆ ప్రవాహం సమస్తం ఇందులోనే ఉంది. ఎరిగినదానికి మరణించడం.

''ఈ నిరాకరణ నిర్దిష్టమైన సకారాత్మక కార్యమా?"

విద్యార్థుల తిరుగుబాటు నిశ్చితమైన, నిర్దిష్టమైన చర్యే. కాని ఆ చర్య చాలా పాక్షికం. అది శకలమాత్రం. అది పూర్తి నిరాకరణ కాదు. " ఈ చనిపోవడం, ఈ నిరాకరణ ఒక సకారాత్మక చర్యా " అని మీరు ప్రశ్నిస్తే అది అవును, కాదూ కూడా. ఒక ఇంటిని వదిలివేసి మరొక ఇంటిలో ప్రవేశించినప్పుడు ఆ నిర్దిష్ట చర్య నిర్దిష్టచర్యగా, సకారాత్మక చర్యగా ఉండిపోదు. ఎందుకంటే ఒక అధికార పీఠం వదిలివేసి మరొక దానిని ఆశ్రయించారు. కాబట్టి, కొనాళ్ళకి దీనిని కూడా విడిచి వెళ్ళాల్సి వస్తుంది. అంటే సకారాత్మకమైన చర్యగా కనబడుతున్న దానిని మళ్ళీ మళ్ళీ చేయడం నిజానికి నిష్క్రియ. కోరికనీ ఆంతరిక భద్రత కోసం అన్వేషణనీ నిరాకరిస్తే అది సంపూర్ణ నిరాకరణ అవుతుంది. ఇటువంటి చర్య మాత్రమే మనిషిని పరివర్తింప చేస్తుంది. ఏ రూపంలో ఉన్నా సరే, ద్వేషాన్నీ, ఈర్ష్యను నిరాకరించడమంటే తన లోపలా బయటా మనిషి కల్పించుకున్న ఆ నిర్మాణ స్వరూపం అంతటినీ నిరాకరించడమే అవుతుంది. ఇది చాలా సరళమైనది. ప్రతి సమస్యకి తక్కిన ప్రతి ఒక్క సమస్యతోనూ సంబంధం ఉంటుంది.

"సమస్యను గమనించము – అనే మీ మాటలకు అర్థమిదేనా?"

ఆ గమనింపు వల్లే ఈ సమస్యల యొక్క నిర్మాణమూ, ప్రవృత్తీ తెలిస్తాయి. గమనించడము అంటే సమస్యని విశ్లేషణ చేయడం కాదు. కారణాన్నీ ఫలితాన్నీ బయట పెట్టడం కాదు. అంతా ఇక్కడే స్పష్టంగా చిత్రపటంలో వలె కళ్ళ ఎదుటే ఉంది. మనం గమనించడానికి ఎట్ట–ఎదురుగా ఉంది. కాని గమనించాలంటే మనకంటూ ఏర్పరుచుకున్న ఒక గట్టి అభిప్రాయంతో దానిని చూడకూడదు. చిక్కంతా ఇక్కడే ఉంది. మనం దేనికో కట్టుబడి ఉంటాం. దేనికో మనం చెందియున్నాం అన్న భావం మనకి లోలోపల ఎంతో సంతోషాన్నిస్తుంది. అట్లా దేనికో చెందియున్నప్పుడు మనం సరిగ్గా చూడలేం. మనం చెందియున్నప్పుడు అహేతుకమవుతాం. హింసాత్మకుల మవుతాం. ఆ హింసాత్మకతను అంతమొందించడానికి మరింకొక దానిని ఆశ్రయిస్తాం ఆ విధంగా ఒక విష వలయంలో చిక్కుకుపోతాం. యుగయుగాలుగా మానవుడు చేసినదిదే. దీనినే స్పష్టాస్పష్టంగా " పరిణామము " అని అంటాడు. ప్రేమ అనేది ఎక్కడో కాలాంతంలో లేదు. ఇప్పుడుంటే ఉన్నట్లు, లేకపోతే లేనట్లే. అది లేనప్పుడే నరకం. ఆ నరకాన్ని సంస్కరించడమంటే ఆ నరకానికే అలంకారాలు సమకూర్చడం అనమాట.

(' కన్వర్సేషన్స్ ' నుండి, పుటలు 1– 9; అనువాదం:పి.ఎస్.సుందరం)

# పునర్జన్మ ఉన్నదా?

ఒకరి ప్రశ్న : పునర్జన్మ సిద్ధాంతంలోని నిజానిజాలు ఏమిటి? అందులో వున్న నిజం ఏమిటి, అసత్యం ఏమిటి?

కృష్ణమూర్తి : ఈ ప్రశ్నను అర్థంచేసుకోడానికి సందేహించే మనసు, శోధించే మనసు వుండాలి. మనసు మూసుకొనిపోయి వుండకూడదు. మనసు తలుపులు తెరచి వుండాలి. ఇది చాలా ముఖ్యం. శోధన అంటే విచారణ. అంటే సత్యాన్ని అన్వేషించడం అని అర్థం. సత్యం ఒక సిద్ధాంతాన్ని అనుసరించి వుండదు. సత్యం నమ్మకమూ అంధవిశ్వాసమూ అనే వలలో చిక్కుకొనిపోయి వుండదు. ముందుగానే ఏర్పరుచుకున్న అభిప్రాయాలు, నిజాయితీ లేని ఆలోచనలూ ఈ విచారణకు అడ్డు తగులుతాయి. ఎంతో ప్రాచీనకాలంలో, ఎంతో గొప్ప పండితులు అధికారికతతో చెప్పినవి వుదహరించినంత మాత్రాన అవి సత్యాన్ని అందించలేవు. విచారణలో పక్షపాతాలకు, నమ్మకాలకు స్థానం లేదు. వాటికి మిమ్మల్ని కట్టివేసుకుంటే మీరు తయారు చేసుకున్న ఆ బంధాల పరిధి లోపలే మీరు తిరుగుతుంటారు.

పునర్జన్మించేది ఏది? మళ్ళీ పుటకను పొందే, కొనసాగుతూ పోయే ఆ గుణం, ఆ తత్వం ఏమిటి? రెండు స్థితులు మాత్రమే కొనసాగుతూ వుండగల అవకాశం వున్నది. ఒకటి – ఆత్మ అనబడే ఆ ఆధ్యాత్మిక సత్వం; మరొకటి ఏమిటంటే – 'నేను' 'నాది' అనేది. ఈ ఆధ్యాత్మిక సత్వం 'నేను', 'నాది' ల చేత సృష్టింపబడినదై వుండటానికి వీల్లేదు. అది, ఆ తత్వం ఆలోచనా ప్రక్రియల ద్వారా తయారైనదీ కాదు. అది ఆధ్యాత్మిక సత్వమే కనుక అయితే అజ్ఞానానికి, భ్రాంతులకు అతీతంగా వున్నదవుతుంది. అది 'నేను' కానిది కనుక అయితే అప్పుడది కాలరహితమైనదిఅవాలి. కాలరహితమైనది పరిణామం చెందదు, ఎదగదు, మరొకటిగా అవదు. దానికి మరణం వుండదు. అది మరణరహితం అయినప్పుడు 'నేను' కు అతీతంగా వుంటుంది. నా యోచనా యోచనలకు ఆవలగా వుంటుంది. నా చేతనావర్తపు పరిధుల లోపల వుండదు. అందుచేత దానిని గురించి మీరు ఆలోచించలేరు, దానికి పునర్జన్మ వుంటుందా వుండదా అనే విషయాన్ని మీరు విచారణ చేయలేరు. అదేమో కాలరహితమైనది, మరణ రహితమైనది; మీ ఆసక్తి, మీకు కావలసినది ఏమో మరణం గురించి, కాలం గురించి; కాబట్టి దాని విషయమై మీరు విచారణ చేయడం సాధ్యం కాదు. ఆ ఆధ్యాత్మిక సత్వపు స్వభావ లక్షణాలను గురించి ఊహాపోహలు చేయడం ఒక పలాయనం. తెలియని దాని గురించి ఊహాపోహలు చేయడం పలాయనమే. సత్యాన్ని అవగాహన చేసుకోవడంలో ఈ పలాయనం తప్పకుండా ఒక గట్టి అవరోధంగా నిలబడుతుంది.

మీకు నిజంగా ఆ ఆధ్యాత్మిక తత్వపు నిరంతరత్వం గురించిన అక్కరలేదు. మీకు కావలసినది "మీరు" – "నేను" నిరంతరంగా అవిచ్ఛిన్నంగా కొనసాగడం. అంటే 'నేను', 'నాది' తను సాధించిన విజయాలతో సహా, తన ఓటములతో సహా, తన నిరాశా నిస్పృహలతో, తన బేంకు నిలవలతో, తన ప్రత్యేక గుణగణాలతో, తన స్వాభావిక వైపరీత్యాలతో సహ కొనసాగుతాడా అనేది మీకు కావాలి. 'మీరు' అంటే అది ఒక శరీర సంబంధితమైన ప్రక్రియే కాకుండా, మనోతత్వ ప్రక్రియ కూడా. భౌతిక అస్తిత్వం అంతమైపోయినప్పుడు ఈ 'మీరు' – అంటే మీ ఆస్తిపాస్తులతో ముడిపడిపోయిన నేను – మీ కుటుంబానికి చెందిన నేను – మీ నమ్మకాలతో కూడిన నేను – శరీర మరణానంతరం కూడా కొనసాగుతూ వుంటుందా? అనే విషయం మీరు తెలుసుకోవాలనుకుంటున్నారు. కొనసాగడం అంటే మీ అర్థం ఏమిటసలు? నేను, నాది అంటే ఏమిటో – అంటే పేరు, ప్రత్యేకమైన గుణగణాలు, సాధించిన విజయాలు మొదలైనవి – వివిధ చేతనా స్థాయిలలో వున్న వీటన్నింటిని చాలా వరకు పరీక్షించి చూశాం. కొనసాగడం అంటే అర్థం ఏమిటి? కొనసాగేటట్లు చేసేది ఏది? కొనసాగింపును, శాశ్వతంగా వుండటం అనే కొనసాగింపును పట్టుకొని వ్రేలాడుతున్నది ఏది? శాశ్వతంగా వుంటారు అని కనుక మీకు హామీ దొరుకుతే, అప్పుడిక కొనసాగింపును పట్టుకొని వ్రేలాడరు. స్వంత వస్తువుల్లో, ఆస్తిపాస్తుల్లో, స్వవిషయంలో, స్వకుటుంబంలో, మీ నమ్మకాలలో శాశ్వతత్వాన్నీ, భద్రతనూ పొందాలని మీరు కోరుకుంటూ వుంటారు. శరీరం చనిపోయినప్పుడు వస్తువుల శాశ్వతత్వం, కుటుంబపు శాశ్వతత్వం అన్నీ పోతాయి. కానీ, శాశ్వతత్వం అనే భావన మాత్రం కొనసాగితే కొనసాగవచ్చు. మనం కొనసాగిపోతూ వుంటే బాగుంటుంది అనే భావన అది. ఆలోచన, 'నేను' అనే భావన కొనసాగిపోతూ వుంటుందా? ఒక అనుభవం నుంచి మరొక అనుభవానికి పోతూ, నిరంతరం మరొకటి ఏదో అవుతూ, ఆ రకంగా తయారవుతూ వుండే ఈ 'నేను' కొనసాగిపోతూ వుంటుందా? 'నేను' అని గుర్తింపబడుతున్న ఆలోచన కొనసాగిపోతూ వుంటుంది అనే దానిలో కొంత అర్థం వున్నది. విద్యుచ్ఛక్తి తరంగాల లాగే ఆలోచనకూ అస్తిత్వం వున్నది. ఈ ఆలోచనలను అవి 'మీవి' అని మీరు ప్రత్యేకంగా గుర్తించినప్పుడు అది 'మీరు'. ఆ విధంగా 'మీరు' అనే ఆలోచన కొనసాగుతుంది.

సరే, కొనసాగుతూ పోయేది ఏమవుతుంది? ఒక అనుభవం నుంచి మరొక అనుభవానికి కదిలిపోతూ, నిరంతరం మరొకటేదో అవుతూ పోయేది ఏమవుతుంది? ఏదైతే కొనసాగుతూ పోతూ వుంటుందో దానికి పునరుజ్జీవనం వుండదు. ఒక అనుభవాన్నుంచి మరొక అనుభవానికి కదలి వెళ్ళిపోతూ, మరొకటిగా అవుతూ పోయేది తనను తాను నిరంతరంగా పునర్ నిబద్ధితం చేసుకుంటూ వుంటుంది. అందుచేత దానికి పునరుజ్జీవనం వుండదు. ఆలోచనల సముదాయమే తానుగా గుర్తింపబడిన 'నేను' కొనసాగుతూ వుంటుంది. అయితే కొనసాగుతూ వుండేది ఎప్పుడూ క్షీణించి పోతూ కూడా వుంటుంది. ఎందుకంటే అది ఒక అనుభవం నుంచి మరొక అనుభవానికి కదిలిపోతూ నిలవ చేసుకుంటూ

వుంటుంది. అనుభవాలను నిలవ చేసుకోకుండా, అంటే నిన్నలు లేకుండా, నిరంతరంగా అనుభూతి చెందుతూ వున్నప్పుడు మాత్రమే పునరుజ్జీవనం వుంటుంది. ఏదైతే సమాప్తమవుతుందో దానికి పునరారంభం వుంటుంది. కానీ కొనసాగిపోతూ వున్నదానికి పునరావిర్భావం వుండదు. పరివర్తన కూడా వుండదు. మరణంలో మాత్రమే, క్షణానికి మృతి చెందినప్పుడు, రోజుకు మృతి చెందినప్పుడు, ఆ మరణంలో మాత్రమే పునరుజ్జీవనం వుంటుంది. సమాప్తం అవడంలోనే ప్రేమ వుంటుంది. ప్రేమ ప్రతి క్షణం కొత్తగా వుంటుంది. ప్రేమ కొనసాగిపోతూ వుండదు. అది పునరుక్తం అవదు. అదే ప్రేమలోని గొప్పదనమూ, ప్రేమ లోని సౌందర్యమూ.

పునర్జన్మ సిద్ధాంతంలో వున్న నిజం ఏమిటి? అసత్యం ఏమిటి అన్న ప్రశ్నకు నేను సమాధానం ఇవ్వలేదని బహుశ మీలో చాలా మంది అనుకుంటారేమో. నేను చెప్పిన దానిని కనుక మీరు దీర్ఘంగా యోచించి చూస్తే, ఏది నిజం, ఏది అసత్యం అనేది నేను స్పష్టంగా విడదీసి చూపానని మీరు గ్రహించుకో గలుగుతారు. జీవితంలోని ప్రగాఢమైన సమస్యలకు అవును, కాదు అని ఇదమిత్థమైన సమాధానాలు వుండవు. ఆలోచనా-రహితులు మాత్రమే ఒక సమస్యకు అవును లేక కాదు అనే సమాధానం కావాలని కోరుకుంటారు. ఈ సమస్యను విచారణ చేస్తునప్పుడు కొనసాగింపులోని నిజాన్ని మనం కనిపెట్టాం. జీవితం, మరణం ఒకటే. అది తెలుసుకున్నవారు ప్రతి నిమిషమూ మరణిస్తారు. అమరత్వం అంటే ఫలానా అని గుర్తించ బడిన ఆలోచనల యొక్క కొనసాగింపు కాదు. మర్త్యుడు అంటే మరణం వున్నవాడు. అమరత్వం కోరుకోవడం వల్ల ప్రయోజనం లేదు. 'నేను', 'నాది' అంటూ సాగే ఆలోచనా ప్రక్రియ సమాప్తమైనప్పుడే అమరత్వం కలుగుతుంది.

(ది కలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ జె.కృష్ణమూర్తి,
4వ సంపుటం; బొంబాయి,
29 ఫిబ్రవరి, 1948)

# అజ్ఞానము అంటే తనను తాను తెలుసుకోకపోవడం

ఒకరి ప్రశ్న : స్వీయజ్ఞానం వలన బాధలన్నీ అంతమై పోతాయా? ఈ బాధల కారణంగానే ఆత్మ మళ్ళీ మళ్ళీ జన్మనెత్తవలసి వస్తున్నది కదా?

కృష్ణమూర్తి : బాధలు అనుభవించ వలసి వున్నంత వరకు మళ్ళీ మళ్ళీ జన్మించి తీరాలి అనేది అందులో వున్న భావం. ఆ బాధలకు అతీతంగా పోయేంతవరకు అనమాట. ప్రాచీన హిందూ, బౌద్ధ, ఆసియా ఖండపు చింతన ఇది. బాధ అనే ఈ ప్రక్రియను సమస్తమూ అవగాహన చేసుకొని, అందులో నుండి బయటపడే వరకూ మనం భూమి మీదకు తిరిగి వస్తూనే వుంటామనీ, మళ్ళీ మళ్ళీ జన్మలు ఎత్తుతూ, బాధలు పడుతూనే వుంటామనీ వాళ్ళు అంటారు.

ఒక విధంగా అది నిజమే. అవునా? మన జీవితాలు బాధామయం. మనం పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు ఏ యేటి కా యేడు – జీవితం అంటేనే పోరాటమూ దుఃఖమూ బాధా ఆందోళనా భయమూలతో కూడిన ప్రక్రియగా వుంటున్నది. ఇదంతా మనకు బాగా తెలుసు. ఇది ఒక రకమైన కొనసాగింపు. బాధల కొనసాగింపు. అవునంటారా? అవగాహన వచ్చే వరకు బాధలు పడుతూనే వుంటారా, మళ్ళీ మళ్ళీ జన్మనెత్తుతూనే వుంటారా లేదా అనేది అప్రస్తుతం. ఇప్పుడు బాధ పడుతున్నారు; ఈ వర్తమాన జీవిత కాలంలో బాధలు అనుభవిస్తున్నారు. ఈ బాధలను అంతం చేసుకోగలమా? ఎప్పుడో భవిష్యత్తులో కాదు. తక్షణమే అంతం చేసుకోగలమా? కాల ప్రసక్తి లేకుండా దీనిని గురించి ఆలోచించగలమా?

అది సాధ్యమే అని నేననుకుంటున్నాను. అయితే నేను చెప్పినది మీరు ఆమోదించి తీరాలి అని కాదు. ఎందుకంటే ఈ ఆమోదించడాలకు, అంగీకారాలకు ఏమి విలువ లేదు. అలా కాకుండా, బాధలు అంతమవగలవా అనే విషయాన్ని మీ అంతట మీరే శోధించడం ఆరంభించ-లేరా? నేను ఇప్పుడు మాట్లాడుతున్నది మానసికమైన బాధలను గురించి. దేహ సంబంధిత నొప్పులూ, పోట్లూ కాదు. మనసు యొక్క మనోతత్వ సంబంధిత స్థితిని కనుక మనం అవగాహన చేసుకుంటే, అది బహుశ మన శరీర బాధల ఉపశమనానికి కూడా సహాయపడ గలుగుతుందేమో. అందుచేత, బాధలు పూర్తిగా అంతమై పోగలవా? లేదూ మనిషి శాశ్వతంగా ఈ బాధలలోనే పడివుండాలని రాసి పెట్టి వున్నదా? అంటే క్రైస్తవులు చెప్పే నరకలోకము, అక్కడ మంటల్లో కాల్చడం మొదలైన పిచ్చి కబుర్లు కాదు. మనం సాధారణంగా బాధలకు చెప్పుకునే అర్థంలో. నిజానికి ఒక యాభై సంవత్సరాలలో, ఎంతో బాధపడటం చాలదా. ఇంకా భవిష్యత్తు గురించి కూడా ఊహాపోహలు చేయవలసి అవసరం ఉన్నదా?

మనం కనుక విచారణ చేయడం ఆరంభిస్తే, మన అస్తిత్వం అనే మొత్తం ప్రక్రియ గురించి మనకే తెలియని అజ్ఞానంలో వున్నంత వరకు బాధలు వుంటూనే వుంటాయని మనమే కనిపెట్ట గలుగుతాం. నన్ను నేను తెలుసుకోనంత వరకు, నా మనసు నడిచే తీరుతెన్నులు, దాని బలమైన ఒత్తిడులూ, వ్యక్తంగా వుండేవీ, అవ్యక్తంగా అచేతనలో వున్నవీ కూడా తెలుసుకోనంత వరకు బాధలు తప్పవు. నిజంగా చూస్తే, అజ్ఞానం వల్లనే మనం బాధలు పడుతున్నాం. ఇక్కడ అజ్ఞానము అంటే తనను తాను తెలుసుకోకపోవడం. సాధారణ దైనిక జీవనంలో మనిషికీ మనిషికీ మధ్య గల సంబంధాలను గురించి అవగాహన లేకపోవడం కూడా అజ్ఞానమే. ఈ అజ్ఞానం వలన కూడా ఎన్నో బాధలు కలుగుతున్నాయి. అయితే నేను మాట్లాడుతున్నది మనకు స్వీయజ్ఞానం బొత్తిగా ఏమాత్రమూ లేకపోవడం గురించి. స్వీయజ్ఞానం లేనట్లయితే బాధలు ఎప్పటికీ కొనసాగుతూనే వుంటాయి.

(హేంబర్గ్; 16 సెప్టెంబరు 1956)

# మీ మనసుకు చికిత్స చేయమని మరొకరిని ఆశ్రయిస్తున్నారా?

ఒకరి ప్రశ్న : సైకో సొమాటిక్ వ్యాధి అంటే ఏమిటి? అది నయం చేసుకోవడానికి మార్గాలు ఏమిటో మీరు సూచించగలరా?

కృష్ణమూర్తి : సైకో సొమాటిక్ వ్యాధి నయం చేసుకోవడానికి మార్గాలు కనుక్కోవడం సాధ్యమని నేను అనుకోను. అసలు మనసుకు చికిత్స చేసేఒక పద్ధతిని వెతకడమే వ్యాధికి కారణమవుతున్నదేమో. ఒక మార్గం కనిపెట్టాలి, ఒక పద్ధతిని అభ్యసించాలి అని అన్నప్పుడు దాని అర్థం – ఆలోచనలను హద్దుల్లో ఉంచడం, అదుపు చేయడం, అణచి వేయడం అని. అంటే మనసుని అవగాహన చేసుకోకపోవడం. భౌతిక శరీరాన్ని మనసు వ్యాధిగ్రస్తం చేసుంది అనేదానిలో సందేహం లేదు. కోపంగా వున్నప్పుడు భోజనం చేస్తే కడుపులో నొప్పి, అజీర్ణం కలుగుతాయి. చాలా తీవ్రంగా ఎవరినైనా మీరు ద్వేషిస్తే శరీరం అనారోగ్యానికి గురి అవక తప్పదు. మనసుని ఒక ప్రత్యేకమైన విశ్వాసానికి పరిమితం చేస్తే మానసిక వైకల్యం గాని, నరాల సంబంధమైన జబ్బులు గాని కలుగుతాయి. అవి మళ్ళీ మీ శరీరం మీద ప్రభావం చూపుతాయి. ఇదంతా సైకో సొమాటిక్ ప్రక్రియలో భాగం. అయితే అన్ని వ్యాధులూ సైకో సొమాటిక్‌వే అని చెప్పడానికి వీల్లేదు. కాని భయమూ, అందోళనా మొదలైన మానసికమైన కలతలు శరీర అనారోగ్యానికి తప్పక దారి తీస్తాయి. కాబట్టి మనసును ఆరోగ్యవంతంగా చేయడం సాధ్యమవుతుందా? మనలో చాలామంది సవ్యమైన ఆహారం తీసుకోవడం మొదలైన జాగ్రత్తలు పాటించి శరీర ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపుతుంటారు. ఇది అవసరమే. కాని మనసుని దిగజారిపోకుండా వుంచుకుంటూ, ఎప్పుడూ ఆరోగ్యంగా, నవ్యనూతనంగా, అప్రమత్తంగా, సజీవంగా మనసును వుంచుకోవాలనే శ్రద్ధ చాలా తక్కువ మందికి ఉంటుంది.

సరే మనసు చెడిపోకుండా ఉండాలంటే మరొకరిని అనుసరించడం ఏమాత్రం ఉండకూడదు. మనసు స్వేచ్ఛగా స్వతంత్రంగా ఉండాలి. అయితే అట్లా సేచ్ఛగా ఉండటానికి మన విద్యావిధానం మనకు సహాయపడటం లేదు. పైగా ఈ దిగజారిపోతున్న సమాజంలో ఇమిడి పోయేటట్లుగా మనలను తయారు చేస్తుంది. అప్పుడు మనసు కూడా దిగజారిపోతుంది. భయపడుతూ ఉండాలని, ఇతరులతో పోటీపడాలని, మన గురించీ, మన భద్రత గురించీ ఎప్పుడూ ఆలోచిస్తూ వుండాలనీ బాల్యం నుండీ మనకు నూరి పోస్తారు. దీని వల్ల మనసు నిరంతరమైన సంఘర్షణకు లోనవడం జరుగుతుంది. ఆ సంఘర్షణ ఫలితం శరీరం మీద కనబడుతుంది. కనుక ఈ సంఘర్షణ అనే ప్రక్రియనంతా అప్రమత్తమైన జాగరూకత వహించి, మనంతట మనమే తెలుసుకుంటూ, అవగాహన చేసుకోవడం చాలా ముఖ్యం. అంతే తప్ప, మనోతత్త్వ శాస్త్రజ్ఞుడి మీదనో, గురువు పైనో ఆధారపడకూడదు. ఒక గురువుని అనుసరించడం అంటే మీ మనసును ధ్వంసం చేసుకోవడమే. ఆ గురువు వద్ద ఉన్నది అని మీరు అనుకుంటున్నది ఏదో మీకు రావాలని అనుకోవడం వల్లనే మీరు అతని వెంట వడుతున్నారు. దిగజారిపోవడానికి ఈ విధంగా నాంది పలుకుతున్నారు. లౌకిక విషయాల్లో కాని, ఆధ్యాత్మిక విషయాల్లో కాని గొప్పవాళ్ళం అవాలని ప్రయాస పడటం అధోగతికి పోయే మార్గాల్లో ఒకటి. ఎందుకంటే ఇటువంటి ప్రయాస వల్ల మిగిలేది ఆందోళనే. దాని ఫలితంగా భయమూ, నిస్పృహ, మానసిక అనారోగ్యమూ తప్పవు. ఇవి మళ్ళీ శరీరం మీద తమ ప్రభావాన్ని చూపుతాయి. ఇదంతా మీకు స్పష్టంగా ఉన్నదని ఆశిస్తాను. మనసుకు చికిత్స చేయడానికి ఇంకొకరిని ఆశ్రయిస్తున్నారూ అంటే హీనస్థితికి దిగజారడంలో అదీ ఒక అంశమే.

(ది కలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ జె. కృష్ణమూర్తి; 9వ సంపుటం; 28 మార్చి 1956, బొంబాయి)

**Statement about ownership and other particulars of Antharanga Yatra**

**FORM IV**

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Krishnamurthi Foundation India Vasanta Vihar 124, 126 Greenways Road Chennai - 600 028. |
| 2. Periodicity of publication | : | Once in four months (August, December and April) |
| 3. Printer's name | : | N. Subramanian |
| Whether Citizen of India | : | Yes |
| Address | : | Sudarsan Graphics Offset Press 27, Neelakanda Mehta Street, T. Nagar Chennai - 600 017. |
| 4. Publisher's name | : | Dr. V. Aravind |
| Whether Citizen of India | : | Yes |
| Address | : | Anugraha Flat No.2, Old No. 26, New No. 51, Fourth Trust Cross Street, Mandavelli Chennai - 600 028. |
| 5. Editor's Name | : | K. Krishnamurthy |
| Address | : | Krishnamurti Foundation India Vasanta Vihar 124, 126 Greenways Road, Chennai - 600 028. |
| 6. Name and address of individuals who own the newspaper and partners or shareholders holding more than one per cent of the local capital. | : | Krishnamurti Foundation India Vasanta Vihar 124, 126 Greenways Road Chennai - 600 028. |

I, Dr. V. Aravind, hereby declare that the particulars given are true to the best of my knowledge and belief.

(V. Aravind)

*Published in August, December, April*
*Registered with The Registrar of Newspapers for India under No. TNTEL/2006/19442*

*PERIODICAL*

*If undelivered please return to:*
KRISHNAMURTI FOUNDATION INDIA
Vasanta Vihar, 124, 126 (Old 64, 65) Greenways Road
Chennai - 600 028. Tel: 24937803 / 24937596
E-mail : publications@kfionline.org
Websites : www.kfionline.org / www.jkrishnamurti.org

*Published by Dr. V. Aravind on behalf of the Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 (Old 64, 65) Greenways Road, Chennai - 600 028.*
*Printed by N. Subramanian at Sudarsan Graphics Offset Press, 27, Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy*